ఎల్లమ్మ కల్యాణం.. పులకించిన భక్తజనం





అమీర్‌పేట: భక్తుల కోర్కెలు తీర్చే బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. డప్పుల చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలతో అలరించారు. జయహో ఎల్లమ్మ అంటూ భక్తులు చేసిన నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. మంగళవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం

- భాజాభజంత్రీల నడుమ ఉత్సవ మూర్తులను కల్యాణ వేదికపైకి తీసుకొచ్చారు.
- వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ పునర్వసు నక్షత్రయుక్త అభిజిత్‌లగ్న సుముహూర్తమున ఉదయం 11.55 గంటల సమయంలో కల్యాణం నిర్వహించారు.

ప్రముఖుల హాజరు..

అమ్మవారి కల్యాణ మహోత్సవానికి మేయర్ గద్వాల విజయలక్ష్మి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్, దేవాదయశాఖ కమిషనర్ అనిల్ కుమార్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి శశిధర్‌రెడ్డి, కాట్రగడ్డ ప్రసూన, కార్పొరేటర్లు సరల, లక్ష్మిబాల్‌రెడ్డి, నామన శేషుకుమారి, వైఎస్‌ఆర్‌సీపీ నేత వెల్లాల రామ్మోహన్, జోగిని శ్యామల, దైవజ్ఞశర్మ, ఆలయ ఈఓ అన్నపూర్ణ, చైర్మన్ సాయిబాబాగౌడ్ హాజరయ్యారు.

పోటెత్తిన భక్తులు..

ఉదయం నుండే భక్తులు ఆలయానికి పోటెత్తారు.భక్తుల రద్దీ కారణంగా ఆలయ పరిసరాలు అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకుంది. దర్శనానికి కొంత ఆలస్యంగా అనుమతించడంతో విపరీతమైన రద్దీతో తోపులాట జరిగి వృద్ధులు, మహిళలు కిందపడిపోయారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి క్యూలైన్లలో ఉన్న భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.



అమ్మవారికి పూజ చేస్తున్న ఆలయ ఈఓ అన్నపూర్ణ







సనత్‌నగర్: ఎల్లమ్మ కల్యాణ మహోత్సవంలో సనత్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ నేత ఆర్‌బీ నరేష్ అమ్మవారికి గవ్వలు, ఇలాచి దండ సమర్పించారు.

పాసుల జారీతో గందరగోళం

ఎల్లమ్మ దర్శనం కోసం ఇష్టానుసారంగా వీఐపీ పాసులు జారీ చేయడం, పాసులో కేటాయించిన స్లాట్ సమయంలో కాకుండా ఇష్టం వచ్చినట్లుగా దర్శనాలకు రావడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరు ఒకేసారి వచ్చి క్యూలైన్‌లో రావడంతో తొక్కిసలాట జరిగి పలువురు మహిళలు, చిన్నారులు కింద పడిపోయారు.ఓ మహిళ, ఇద్దరు చిన్నారులు స్పృహతప్పి పడిపోవడంతో పోలీసులు బారికేడ్లను తొలగించి వారిని బయటకుతీసుకువచ్చారు. లైటింగ్ కోసం చేసిన ఎర్తింగ్ వైరు తగిలి ఇద్దరు మహిళలు షాక్‌కు గురయ్యారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈసారి నేనే ఎమ్మెల్యేను!



తనయులతో కలిసి విద్యాదినోత్సవంలో పాల్గొన్న పద్మారావు గౌడ్

లాలాపేట: సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి ఆబ్కారీ మంత్రి, ప్రస్తుతం డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న పద్మారావుగౌడ్ వచ్చే ఎన్నికల్లో సైతం బరిలో నిలిచి హ్యాట్రిక్ సాధిస్తానని చెప్పకనే చెప్పున్నారు. మంగళవారం లాలాపేటలోని ప్రభుత్వ పాఠశాలలో జరిగిన విద్యా దినోత్సవంలో తన తనయులు కిషోర్‌గౌడ్, రామేశ్వర్‌గౌడ్‌తో కలిసి పాల్గొని పలు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఈ సారి మళ్లీ నేనే ఎమ్మెల్యేనని.. వచ్చేసారికి నా వారసులొస్తారు. రాజకీయాల్లో వారసత్వం అనేది ఉంది నా తర్వాత నా కుటుంబం నుంచి నా పిల్లల్ని పరిచయం చేస్తాననడంతో అక్కడున్నవారంతా పద్మారావు వ్యాఖ్యలపై చర్చించుకోవడం కనిపించింది.

వైభవంగా ఎల్లమ్మ కల్యాణం

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం బొల్లారం, చింతబస్తీ, ఆదర్శనగర్ ప్రాంతాల్లోని రేణుకా ఎల్లమ్మ ఆలయాల్లో రేణుకా ఎల్లమ్మ కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ సీనియర్ నాయకులు శ్రీ గణేష్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఓయూలో భోజనశాల ఏర్పాటు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (వ్యాయామ విద్య) కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.సత్యనారాయణ చొరవతో స్పోర్ట్స్ హాస్టల్‌లో భోజనశాలను ఏర్పాటు చేశారు. క్యాంపస్‌లో 10 సంవత్సరాలు క్రితం నిర్మించిన స్పోర్ట్స్ హాస్టల్‌లో భోజనశాలను ఏర్పాటు చేయలేదు. ఇక్కడి విద్యార్థులు ప్రతి రోజు టిఫిన్, భోజనాలకు కోసం మూడు పూటలు కిలో మీటర్ దూరం నడిచి భోజనం చేయాల్సి వస్తుంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదు. స్పోర్ట్స్ హాస్టల్‌లోనే భోజనశాల ఏర్పాటు చేయాలని ఇటీవల విద్యార్థుల ఆందోళనలు చేపట్టారు. ప్రిన్సిపల్ ప్రొ.సత్యనారాయణ చొరవ తీసుకొని విరాళంగా రూ.50 వేలను అందచేసి భోజనశాలను ఏర్పాటు చేశారు.

ఓయూలో వివిధ అంశాలపై సదస్సులు



కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్‌ను సన్మానిస్తున్న ప్రొఫెసర్లు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఓయూ క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన విద్యా దినోత్సవంలో వివిధ విభాగాలలో సదస్సులు నిర్వహించారు. ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ అధ్యక్షతన వివిధ విభాగాల్లో జరిగిన సదస్సుల్లో కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్–ఇన్–చీఫ్ ఎన్.వెంకటేశ్వర్లు, పర్యావరణ వేత్త ప్రొ.పురుషోత్తమరెడ్డి, ట్రాన్స్‌కో సూపరింటెండెంటింగ్ ఇంజినీర్ సురేష్‌బాబు, టీఎస్ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ అమిత్‌కుమార్ వివిధ అంశాలపై మాట్లాడారు. అనంతరం ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్లు కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లను సన్మానించారు.

పేదల విద్యాభివృద్ధికి సీఎం కృషి

గెల్లు శ్రీనివాస్‌యాదవ్

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఓయూలో విద్యా దినోత్సవాన్ని విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పేదల విద్యాభివృద్ధికి సీఎం కేసీఆర్ చేస్తున్న కృషిని కొనియాడారు. అనంతరం ఓయూలోని వివిధ కాలేజీల నుంచి ఓపెన్ ఎయిర్ ఆంఫి థియేటరల్ వరకు అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు మార్నింగ్‌వాక్ చేపట్టారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి

రసూల్‌పురా: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించే దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మన బస్తీ–మనబడి కార్యక్రమం చేపట్టిందని బీఆర్‌ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం తిరుమలగిరి బాలుర ప్రభుత్వ పాఠశాల్లో జరిగిన విద్యా దినోత్సవ కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, వార్డు మహిళ అధ్యక్షురాలు నాగినేని సరిత, బోర్డు మాజీ సభ్యులు శ్యాంకుమార్, భాగ్యశ్రీ తో కలిసి మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫాం, నోటుబుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో తాగునీటి వసతి, టాయిలెట్ల సౌకర్యం విద్యుత్ సరఫరాతో పాటు విద్యార్థులకు మెచీలు, టెబుల్స్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఇటీవల పది ఫలితాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులను శాలువాతో సత్కరించారు.

- బొల్లారం రిసాలబజార్ ప్రభుత్వ పాఠశాలలో విద్యా దినోత్సవం సందర్భంగా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యులు జే.లోకనాథం పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్స్ యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్, సునీల్, శ్రీనివాస్ రెడ్డి, రాజు, ఇందిర, సంజీవ రావు, జహంగీర్, బాలరాజు పాల్గొన్నారు.

ఓయూలో ఓపెన్ ఎయిర్ థియేటర్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఓపెన్ ఎయిర్ ఆంఫి థియేటర్ అందుబాటులోకి వచ్చింది. సిద్ధార్థ విద్య సంస్థల చైర్మన్, ఓయూ పూర్వ విద్యార్థి డాక్టర్ నాగయ్య అందించిన రూ.80 లక్షల విరాళంతో నిర్మించిన థియేటర్‌ను మంగళవారం వీసీ ప్రొ.రవీందర్ ప్రారంభించారు. క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియం పక్కన నిర్మించిన ఈ థియేటర్‌టకు డా.నాగయ్య ఓపెన్ ఎయిర్ ఆంఫి థియేటర్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా డా.నాగయ్య మాట్లాడుతూ.. జీవితంలో సర్వసం అందించిన అమ్మా లాంటి ఓయూకు తిరిగి చెల్లించుకోవాలనే సంకల్పమే ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మాణం అన్నారు. అనంతరం డా.నాగయ్యను ఓయూ అధికారులు సన్మానించారు.

తొలిరోజు సందడి

ఓయూ క్యాంపస్‌లో మంగళవారం ఉదయం ప్రారంభమైన ఓపెన్ ఎయిర్ ఆంఫి థియేటర్‌లో రాత్రి జరిగిన వివిధ కార్యక్రమాలతో సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతులను అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ, ఓపెన్ ఎయిర్ థియేటర్ దాత డాక్టర్ నాగయ్య ప్రసంగించారు.

సాయన్న ఆశయ సాధనకు కృషి



జిమ్ సెంటర్‌ను సందర్శించిన లాస్య నందిత, బీఆర్‌ఎస్ నేతలు

కంటోన్మెంట్: దివంగత ఎమ్మెల్యే, తన తండ్రి సాయన్న ఆశయాలకు అనుగుణంగా కంటోన్మెంట్ అభివృద్ధి పాటు పడతానని మాజీ కార్పొరేటర్ లాస్య నందిత అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రెజిమెంటల్ బజార్‌లోని నెంబర్ వన్ స్కూల్లో నిర్వహించిన వేడుకలకు హాజరై విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఎంతో మెరుగయిందన్నారు. దివంగత నేత సాయన్న కంటోన్మెంట్‌లో స్కూళ్ల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో నివేదిత, అశోక్ కుమార్, సతీష్, చిన్న, కసిరెడ్డి, క్రిస్టోఫర్, బషీర్, పనస సంతోష్, మురళియాదవ్, వెంకటేశ్, భాస్కర్ పాల్గొన్నారు.

- దివంగత నేత సాయన్న చిట్టచివరి సారిగా నిధులు కేటాయించిన నాలుగో వార్డు గాంధీ నగర్‌లోని జిమ్ నిర్మాణం పూర్తయిందని, త్వరలోనే ప్రారంభించనున్నట్లు లాస్య నందిత తెలిపారు. ఈ మేరకు స్థానిక బీఆర్‌ఎస్ నేతలతో కలిసి మంగళవారం జిమ్ పనులను పరిశీలించి మాట్లాడారు. గాంధీనగర్‌లో జిమ్ సెంటర్ కావాలని స్థానికులు దివంగత నేతను అడిగిన వెంటనే రూ.20 లక్షలు కేటాయించినట్లు గుర్తు చేశారు.

వైభవంగా ఇస్కాన్ రథయాత్ర



కంటోన్మెంట్: సికింద్రాబాద్ ఇస్కాన్ దేవాలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో జగన్నాథస్వామి రథయాత్ర వైభవంగా సాగింది. ఉదయం కుంభాభిషేకం, మంగళహారతితో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాన్ని దర్శించుకున్నారు. సాయంత్రం 4.30 గంటల సమయానికి జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర ఉత్సవ విగ్రహాలతో కూడిన రథం ఊరేగింపు ప్రారంభమైంది. భక్తుల జయ జయ ధ్వానాలు, రంగవళ్లులు, పూలతో స్వాగతాలతో శోభాయాత్ర అత్యంత శోభాయమానంగా సాగింది. ఆలయం ప్రధాన ద్వారం నుంచి ప్రారంభమైన యాత్ర సంగీత్ చౌరస్తా మీదుగా సెయింట్ మేరీస్ రోడ్డు గుండా ముందుకు సాగి, తిరిగి ఆలయానికి చేరుకుంది.

పోలీసులతో కలిసే బాబా క్లాసిక్ లాడ్జికి వెళ్లాం

● యూసుఫ్, మనోజ్‌కుమార్

సాక్షి, సిటీబ్యూరో: మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాలికాబజార్‌లో ఉన్న బాబా క్లాసిక్ లాడ్జికి తాము పోలీసులతో కలిసే వెళ్లామని బన్సీలాల్ పేట్, మారుతివీధిలకు చెందిన వ్యాపారులు మహ్మద్ యూసుఫ్, మనోజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. 'లాడ్జిలో వ్యభిచారం' శీర్షికతో సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనంపై ఇరువురూ వివరణ ఇచ్చారు. మార్కెట్ పోలీసులు కోరిన మీదటే సాక్షులుగా వారి వెంట లాడ్జికి వెళ్లామని, అక్కడి మొదటి అంతస్తులోని 201 గదిపై అధికారులు డెకాయ్ ఆపరేషన్ చేశారని పేర్కొన్నారు. ఆ గదిలో వ్యభిచార నిర్వాహకుడు కోల్‌కతాకు చెందిన కబితా హనీఫ్ మొల్లా, విటులు అమీద్ అలీ, సాయికృష్ణ, శ్రీధర్, పవన్ కుమార్ రెడ్ హ్యాండెడ్‌గా దొరికారని తెలిపారు. హోటల్ యజమాని, రిసెప్షనిస్టు కూడా వ్యభిచార నిర్వాహకులను సహకరిస్తున్నట్లు వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కమాలుద్దీన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీలపై అవగాహన

చిలకలగూడ : ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ డేటా, అనాలిటిక్స్ జాతీయ కోఆర్డినేటర్ దీపక్ జాన్ నేతృత్వంలో సికింద్రాబాద్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలపై విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 16 నుంచి 35 ఏళ్ల వయసుగల వారంతా క్విజ్‌లో పాల్గొనేందుకు అర్హులని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంకు బహుమతులు ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్, ట్యాబ్‌లు, మహిళ టాపర్‌కు ఎలక్ట్రికల్ స్కూటర్, ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. 7661899899 ఈ నంబర్‌కు మిస్‌కాల్ ఇచ్చి జూలై 1వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, జూలై 2న ఆన్‌లైన్ క్విజ్ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు బ్రహ్మజీ, కిరణ్, అరుణ్ పాల్గొన్నారు.

12 కిలోమీటర్లు.. ఎనిమిది నిమిషాలు..

సనత్‌నగర్: హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం గ్రీన్ ఛానల్ ఏర్పాటుచేసి లైవ్ ఆర్గాన్ (ఊపిరితిత్తులు)ను సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి నుంచి జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రికి తీసుకువెళ్లడంలో మార్గం సుగమం చేశారు. ఆయా ఆస్పత్రుల మధ్య దూరం 12 కిలోమీటర్లు కాగా ఎనిమిది నిమిషాల్లో లైవ్ ఆర్గాన్‌ను తరలించారు. యశోద ఆస్పత్రి నుంచి 10.12 గంటలకు ఊపిరితిత్తులతో బయలుదేరిన ప్రత్యేక వాహనం 10.20 గంటలకు జూబ్లీహిల్స్ అపోలోకు చేరుకుంది. లైవ్ ఆర్గాన్‌ను తరలించడంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల కృషిని యశోద, అపోలో ఆస్పత్రి నిర్వాహకులు ప్రశంసించారు. విలువైన ప్రాణాన్ని కాపాడడంలో వారి పాత్ర ఎంతో అమూల్యమైనదన్నారు. ఈ ఏడాదిలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఎనిమిది సార్లు అవయవ రవాణాను సులభతరం చేశారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

సికింద్రాబాద్: పట్టాలపై నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వృద్ధురాలి ఎంఎంటీఎస్ రైలు ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. బొల్లారం–గుండ్ల పోచంపల్లి రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలోని పట్టాలపై సుమారు 60–65 ఏళ్ల మధ్య వయస్సు గల వృద్ధురాలు నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక వైపు నుంచి వచ్చిన ఎంఎంటీఎస్ రైలు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందింది.

విద్య, వైద్య రంగాలకు ప్రాముఖ్యం



న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మరావుగౌడ్

అడ్డగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాముఖ్యం ఇస్తుందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని అడ్డగుట్టలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని 10 ప్రభుత్వ స్కూళ్లకు మరిన్ని సదుపాయాలను కల్పించేందుకు ఏర్పాట్లు జరుపుతున్నామన్నారు. 50 సంవత్సరాల సికింద్రాబాద్ ప్రజల కలను నెరవేర్చేలా సీతాఫల్‌మండిలో కొత్తగా జూనియర్, డిగ్రీ కాలేజీలు స్థాపించామని, వాటికి రూ. 30 కోట్లతో నూతన భవనాలను నిర్మిస్తున్నామన్నారు. అనంతరం అడ్డగుట్ట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్‌తో కలిసి గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు.

రాత పుస్తకాల పంపిణీ..

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శాంతినగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు యూనిఫాం, రాత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాలకూర శ్రీనివాస్ గౌడ్, అమర్ బన్సోడే తమ సొంత డబ్బులతో విద్యార్థులను నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు పొన్నాల రాజు, అయుబ్ ఖాన్, ఉమారాణి, హాషమ్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ లాలాపేటలో..

లాలాపేట: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రభుత్వ బాలికల పాఠశాల(మార్కెట్ లాలాపేట)లో జరిగిన విద్యా దినోత్సవం కార్యక్రమంలో పద్మారావు గౌడ్ పాల్గొని మన బస్తీ–మన బడి కార్యక్రమంలో భాగంగా లాలాపేట ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను ఉపయోగించుకుని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఇటీవల టెన్త్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన పలువురి విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేశారు. నాగరాజుగౌడ్, సునీల్ ముదిరాజ్, నాగేశ్వర్‌రావు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

- విద్యా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి తార్నాక డివిజన్‌లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

శ్మశానవాటికల ప్రైవేటీకరణ ఆపాలి



జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

సికింద్రాబాద్: నగరంలో శ్మశాన వాటికలను అభివృద్ధి చేసి మహాప్రస్థానం పేరుతో ప్రైవేటు ఏజెన్సీలకు కట్టబెట్టే కుట్రలను తిప్పి కొడతామని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మాల ప్రజా సంఘాల నేతలు సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. బేగంపేట శ్మశాన వాటికలోని బ్యాగరులను ఖాళీ చేయాలని జోనల్ కమిషనర్ సోమవారం ఆదేశించడంతో సదరు బ్యాగరులు ఆందోళనకు గురై ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించినట్లు తెలిపారు. శ్మశానవాటికల ప్రైవేటీకరణ ఆపాలని, మాల బ్యాగరుల కులవృత్తిని కాపాడాలన్నారు. అనంతరం జెడ్‌సీ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు . వెంకటేశ్వర్లు, భానుప్రకాష్, కోతి ఇందిరా, అంజలి, శ్రీధర్‌రావు, దాసరి సత్యనారాయణ, మహేశ్వర్, శ్రీరంగ, సుధీర్ పాల్గొన్నారు.

శోకసంద్రంలో జీవైఆర్ కాంపౌండ్ బస్తీ

సౌందర్య, పిల్లల అంత్యక్రియలు




రోదిస్తున్న కుటుంబీకులు, బస్తీవాసులు

బన్సీలాల్‌పేట్: అదనపు వరకట్న వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్న సౌందర్య ఆమె పిల్లల అంత్యక్రియలు మంగళవారం కుటుంబీకులు, బంధువులు, బస్తీ వాసుల అశ్రునయనాలతో నిర్వహించారు. మంగళవారం సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రిలో సౌందర్య మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం సౌందర్యతో పాటు ఇద్దరు పిల్లల మృతదేహాలను కుటుంబీకులకు అప్పగించారు. మృతదేహాలు బస్తీలోకి రాగానే కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఒక్కసారిగా జీవైఆర్ కాంపౌండ్ శోకసంద్రంగా మారింది. సౌందర్య అంతిమయాత్రకు జీవైఆర్ కాంపౌండ్ నుంచి వివిధ ప్రాంతాల గుండా హుస్సేన్‌సాగర్ నాలా శ్మశానవాటిక వరకు సాగింది. తల్లితో పాటు ఇద్దరు పిల్లలను హుస్సేన్‌సాగర్ నాలా పక్కన శ్మశానవాటికలో ఒకేచోట ఖననం చేశారు.

భర్త గణేష్‌పై కేసు..

గాంధీనగర్ పోలీసు స్టేషన్‌లో సౌందర్య భర్త గణేష్‌పై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు చెప్పారు. త్వరలో నిందితుడిని అదుపులోకి తీసుకుంటామన్నారు. భర్త వేధింపుల కారణంగా ఇద్దరు పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకొని మరణించిన సౌందర్య ఘటనపై పెద్ద ఎత్తున పౌర సమాజంతో పాటు రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా తీవ్రంగా స్పందించడంతో కేసు వేగంగా దర్యాప్తు కొనసాగుతుంది.

'మంచుకొండ'కు ఉత్తమ ఫౌండేషన్ అవార్డు



సనత్‌నగర్: ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకుని ఉన్నతంగా తీర్చిదిద్దిన మంచుకొండ ఫౌండేషన్‌కు ఉత్తమ ఫౌండేషన్ అవార్డు దక్కింది. ఓల్డ్ నల్లగుట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను రూ.20 లక్షలతో అన్నివిధాలా అభివృద్ధిపరిచినందుకు హైదరాబాద్ డీఈఓ రోహిణి చేతుల మీదుగా మంచుకొండ ప్రకాశంకు ఈ అవార్డును అందజేసి సన్మానించారు.